# ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

**ఫ్లయింగ్‌స్క్వాడ్ వాహనాల్లో పీఏ సిస్టం ఉండాలి**
**బస్సులకు జీపీఎస్ పరికరాలు అమర్చాలి**
**ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి**
**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్**


మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, మార్చి 30 : ఎన్నికల నోడల్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది తమ ఓటుహక్కు ఇతర నియోజకవర్గాల్లో ఉంటే, వెంటనే తమ ఓటును ఫారం-8 ద్వారా మార్చుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు వివిధ అనుమతుల కోసం దరఖాస్తులు సువిధలో 48గంటల ముందుగా సమర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. అన్ని ఏఆర్ఓ కార్యాలయాలు, కలెక్టరేట్‌లో అనుమతుల కోసం సింగిల్ విండో కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎంల రవాణాకు అవసరం మేరకు 5 డీజీటీ వాహనాలు సిద్ధం చేయాలన్నారు. సెగ్మెంట్ల పరిధిలో స్ట్రాంగ్ రూంలు సిద్ధం చేయాలన్నారు. స్ట్రాంగ్ రూంల వద్ద బందోబస్తు ప్రణాళిక చేయాలన్నారు. అక్రమ నగదు, మద్యం, ప్రలోభాల జప్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సామగ్రి సేకరణకు చర్యలు తీసుకోవాలని, ఇంతవరకు వచ్చిన సామగ్రి జాబితా, రావాల్సిన సామగ్రి జాబితా సమర్పించాలన్నారు. పోలింగ్ సామగ్రిలో వెల్‌ఫేర్ కిట్ కూడా ఇవ్వాలన్నారు. వచ్చేవారం అంతరాష్ట్ర సమన్వయ సమావేశం చేపట్టనున్నట్లు, అట్టి సమావేశానికి సంబంధిత అధికారులు హాజరవ్వాలన్నారు. అంతరజిల్లా సమన్వయ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాల్లో పీఏ సిస్టం, ఎన్నికల్లో వాడే బస్సులకు జీపీఎస్ పరికరాలను అమర్చాలన్నారు. బఫర్ బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. ఫిర్యాదుల విభాగానికి ఫిర్యాదులు వచ్చేలా సి-విజిల్, 1950 నెంబర్లపై ప్రజల్లో విస్తత ప్రచారం చేయాలన్నారు. ఎస్‌హెచ్‌ఓలు యువతతో సమావేశాలు ఏర్పాటు చేసి, సి-విజిల్ డౌన్లోడ్‌లు చేయించాలని, యువతలో చైతన్యం తేవాలన్నారు. సువిధలో అనుమతుల విషయమై రోజువారి నివేదిక సమర్పించాలన్నారు. 5 మహిళ, 1 దివ్యాంగ, 1 యూత్ ప్రత్యేక పోలింగ్ కేంద్ర ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. సోషల్ మీడియాపై నిఘా పెట్టాలని, ఎన్నికల సంబంధ వదంతులపై ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రూట్ మ్యాపులు, డిస్ట్రిబ్యూషన్, రిషిప్షన్ లే అవుట్ల సిద్ధం చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ల ముద్రణ పూర్తి చేయాలన్నారు. ఎపిక్‌కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, శిక్షణా ఐపీఎస్ మౌనిక, అదనపు డీసీపీ ప్రసాదరావు, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మండలంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు

కొణిజర్ల, మార్చి 30: మండలంలోని గుబ్బగుర్తిలో శనివారం అత్యధికంగా 43.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోనే ఇది అత్యధికం. జిల్లాలోని మరో 12 ప్రాంతాల్లో 40 నుంచి 41.5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత్త నమోదు కాగా ఎండలకు తోడు వడగాలులు మొదలవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

## ముస్లింలకు పండ్లు అందజేత

కారేపల్లి, మార్చి 30: మండల కేంద్రంలోని జామే మసీద్‌లో రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు కారేపల్లికి చెందిన గంగరబోయిన యాదగిరి శనివారం పండ్లు అందజేశారు. పంపిణీ చేశారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ చైర్మన్ షేక్ గౌసుద్దీన్, ఉపాధ్యక్షుడు షేక్ షఫి, కమిటీ సభ్యులు ఎండీ యాకూబ్ అలీ, మతిన్, తాజుద్దీన్, దాతలు గంగరబోయిన సాయిపూర్ణా, దూదిపాళ్ల భాస్కర్, ప్రవీన్ పాల్గొన్నారు.

## సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ వాయిదా

పెనుబల్లి, మార్చి 30: మండలంలోని వీఎం బంజరలో ఏర్పాటు చేసిన గౌడ కులస్తుల ఆరాధ్య దైవం సర్ధార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ వాయిదా వేశామని ఆహ్వాన కమిటీ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్నందున విగ్రహావిష్కరణ కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేశామని, ఈ విషయాన్ని గమనించాలని, తదుపరి తేదీని తెలుపుతామన్నారు.

## పశువుల వ్యాన్ పట్టివేత

పెనుబల్లి, మార్చి 30: ఏపీలోని తుని నుంచి హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఏరియాకు అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న డీసీఎం వ్యాన్‌ను వీఎం బంజర రింగ్‌సెంటర్‌లో ఎస్సై తన సిబ్బందితో పట్టుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 11 ఆవులు, 29 గిత్త దూడలు మొత్తం 40 శాల్తీలు గుర్తించి పంచనామా నిర్వహించి పాల్వంచలో గల అన్నపూర్ణ గోసంరక్షణ సమితికి తగు రక్షణ నిమిత్తం అప్పగించారు. డీసీఎం వ్యాన్‌ను సీజ్ చేసి శ్రీనుగౌడ్, హసనాబాద్ బాలకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ముదిగొండ స్టేషన్‌కు శిక్షణ కానిస్టేబుళ్లు

ముదిగొండ, మార్చి 30: శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లు గురువారం ముదిగొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ విధులపై వారికి ఎస్సై నరేష్ అవగాహన కల్పించారు.

## కొండబాల కారు తనిఖీ


తనిఖీ చేస్తున్న పోలీసులు

మధిర రూరల్, మార్చి 30: మండలంలోని ఆత్కూరు క్రాస్ రోడ్డులో ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు కారును పోలీసులు శనివారం ఆపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కారును తనిఖీ చేశారు.

## రింగ్‌సెంటర్‌లో వాహనాల తనిఖీ

వైరాటౌన్, మార్చి 30: త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న సందర్భంగా వైరా రింగ్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేపట్టారు. ప్రత్యేక బలగాలు స్థానిక పోలీస్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని ఎస్సై కోరారు.

## వైరా సబ్ రిజిస్ట్రార్, అటెండర్‌పై బదిలీ వేటు

**జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇద్దరు అటాచ్**

వైరాటౌన్, మార్చి 30: వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సబ్ రిజిస్ట్రార్ అరుణ, అటెండర్ కృష్ణను ఖమ్మం రిజిస్ట్రార్ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. 170 యాక్ట్‌లో గిరిజనుల భూములను గిరిజనేతరులకు రిజిస్ట్రేషన్ చేసిన ఆరోపణలతో ఇరువురిని అటాచ్ చేసినట్లు అధికారులు తెలిపారు. వైరా నూతన సబ్ రిజిస్ట్రార్‌గా కే విజయ్, అటెండర్‌ను నియమిస్తూ నియామక ఉత్తర్వులను జారీ చేశారు.

## బోనకల్లులో ఫ్లాగ్ మార్చ్


ఫ్లాగ్ మార్చ్‌లో బలగాలు, పోలీసులు

బోనకల్లు, మార్చి 30: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి బోనకల్లులో పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. వైరా ఏసీపీ రెహమాన్, మధిర సీఐ డి.మధు, ఎస్సై మధుబాబు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయురాలికి సన్మానం

తిరుమలాయపాలెం, మార్చి 30: మండలంలోని కుక్కలతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు కొప్పుల విజయలక్ష్మి ఉద్యోగ విరమణ చేశారు. ఆమెను గ్రామస్తులు శనివారం సన్మానించారు. ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకుడు బానోత్ సూర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కొండబాల నివాళి

చింతకాని, మార్చి 30: మండలంలో చింతకాని గ్రామంలో బీఆర్ఎస్ సానుభూతిపరురాలు బాబారాణి(60) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. శనివారం ఆమె దశదిన కర్మకు మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు హాజరయ్యారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు రమేష్, రత్నాకర్, జానిమియా, చంద్రయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# బోధనకు సాంకేతికత జోడించాలి

**కలెక్టర్ వీపీ గౌతమ్**

చింతకాని, మార్చి 30: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా బోధనకు సాంకేతికతను జోడించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. మండలంలోని నామవరం ఉన్నత పాఠశాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ) ద్వారా జరుగుతున్న బోధనను పరిశీలించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగయ్యాయని అన్నారు. వాటిని విద్యార్థులంతా అందిపుచ్చుకోవాలన్నారు. విద్యార్థి మానసిక-శారీరక ఎదుగుదలకు అనుగుణమైన విద్యాబోధన.. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమవుతుందని అన్నారు. తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో రామయ్య, కార్యదర్శి బాబూరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



**పదోతరగతి పరీక్షా కేంద్రాల పరిశీలన**

మండలంలోని పందిళ్ళపల్లి పాఠశాలలో పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ వీపీ గౌతమ్ శనివారం పరిశీలించారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రసాద్ ఆత్మహత్యాయత్నానికి కారణమైన కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

వేంసూరు, మార్చి 30: కొణిజర్ల మండలంలోని అంజనాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామపంచాయతీ మల్టీపర్పస్ కార్మికుడు, గుమస్తా భూక్యా ప్రసాద్ తమ మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇప్పించాలని అడిగితే పనిలో నుంచి తొలగించాడు. ఇందుకు మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానానికి పాల్పడిన ప్రసాద్‌కు ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందించాలని, కారకుడైన గ్రామపంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని గ్రామపంచాయతీ వర్కర్లు, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు శనివారం మర్లపాడు పంచాయతీ ఎదుట మధ్యాహ్న విరామ సమయంలో నిరసనగా చేపట్టారు. అనంతరం సీనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శి సురేశ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో భూక్యా ప్రసాద్, కుమారస్వామి, యాకుబ్, దేవదాసు, వీరయ్య, కోటయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

**అంజనాపురంలో..**

కొణిజర్ల, మార్చి 30: మండలంలోని అంజనాపురం గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ ఆత్మహత్యాయత్నానికి కారకుడైన పంచాయతీ కార్యదర్శిని ఉద్యోగం నుంచి తొలగించాలని, పంచాయతీ వర్కర్ ప్రసాద్‌కు అయ్యే వైద్యఖర్చులు పంచాయతీ కార్యదర్శుల నుంచి లేదా ప్రభుత్వం నుంచి చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రసాద్ ఆత్మహత్యాయత్నం జరిగి రెండు రోజులు కావస్తున్న ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తోట రామాంజనేయులు, గాదే లక్ష్మీనారాయణ, గ్రామపంచాయతీ వర్కర్ల యూనియన్ నాయకులు పిట్టల మల్లయ్య, గొడ్డుగొర్ల శ్రీనివాస్, రాందాస్‌నాయక్, మంగీలాల్‌నాయక్, మేళ్లచెరువు రాజగోపాల్, జైల్వా పాల్గొన్నారు.


వేంసూరు: గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

## మువ్వా విజయ్‌బాబుకు సత్కారం

ఖమ్మం, మార్చి 30 : తెలంగాణ రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మువ్వా విజయబాబుని ఐఎన్‌టీయూసీ ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విప్లవకుమార్ ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. శనివారం ఖమ్మం నగరంలోని మాజీ ఎంఎల్‌సీ బాలసాని లక్ష్మీనారాయణ నివాసం వద్ద మువ్వాను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నగర అధ్యక్షుడు నరాల నరేశ్ మోహన్‌నాయుడు, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు సైదులు, నగర ఉపాధ్యక్షుడు గయాజ్‌పాషా, ప్రవీణ్, వీరారెడ్డి పాల్గొన్నారు.



# నేడు ఈస్టర్ పర్వదినం

ఖమ్మం, మార్చి 30 : యేసుక్రీస్తు ప్రభువు పునరుత్థానం చెందిన రోజు ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు జరుపుకోనున్నారు. ఆర్‌సీఎం, సీఎస్ఐ, గుడ్ షెఫర్డ్, ఇండిపెండెంట్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలను నిర్వంచనున్నారు. పునరుత్థానాన్ని పురస్కరించుకొని ప్రార్థనా మందిరాలను పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి కేక్ కటింగ్ నిర్వహిస్తారు. స్థానిక వైరా రోడ్ ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ సురేశ్, ఫాదర్ బాలశౌరి శనివారం అర్ధరాత్రి మొదలుకొని ఆదివారం మధ్యాహ్నం వరకు రెండు సర్వీసుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరుపుతున్నారు. స్థానిక కరుణగిరి ఆర్‌సీఎం చర్చిలో చర్చ్ డైరెక్టర్ ఫాదర్ మాథ్యూ వరప్రసాద్ రాజు ప్రత్యేక ఈస్టర్ శుభసందేశాన్ని అందిస్తారు. స్థానిక చర్చ్ కాంపౌండ్ సీఎస్ఐ చర్చిలో గ్రూప్ చైర్మన్ రెవరెండ్ విశ్వం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. మౌంట్ ఫోర్ట్ ఆర్ సీఎం చర్చిలో ఫాదర్ లాజర్ దైవ సందేశాన్ని అందిస్తారు. గుడ్ షెఫర్డ్ చర్చిలో పాస్టర్ సత్యపాల్ ఈస్టర్ శుభసందేశాన్ని భక్తులకు అందించనున్నారు. ఎన్ఎస్‌సీ కాలనీ హోలీ ట్రినిటీ చర్చ్, ఇందిరానగర్ కాలనీ సీఎస్ఐ చర్చ్, పార్సీ బంధం సీఎస్ఐ చర్చ్‌తోపాటు అన్ని ఇండిపెండెంట్ చర్చల్లో ఈస్టర్ వేడుకలు ఆనందోత్సవాలతో జరపనున్నారు.


ప్రార్థనలకు ముస్తాబైన చర్చి

## ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు

పెనుబల్లి, మార్చి 30: ఈ నెల 18న ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు వీఎం బంజర ఉన్నత పాఠశాలలోని రెండు సెంటర్లు, టేకులపల్లి మోడల్ స్కూల్‌లో రెండు, కుప్పెనకుంట్ల గురుకుల పాఠశాలలో ఒక సెంటర్ ఏర్పాటు చేశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ముగిశాయి.


పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

**కారేపల్లిలో..**

కారేపల్లి, మార్చి 30: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్, కారేపల్లి, కోమట్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన టెన్త్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజున పరీక్ష కేంద్రం నుంచి బయటకు రాగానే తమ స్నేహితులతో కేరింతలు కొడుతూ సందడి చేశారు. కారేపల్లిలోని వసతి గృహాల్లో ఉంటూ చదివిన తమ పిల్లలను ఇండ్లకు తీసుకువెళ్లేందుకు తల్లిదండ్రులు హాస్టళ్లకు వచ్చారు.

## పోయిన ఫోన్లు కనుగొనడం 'సీఈఐఆర్'తో సులభతరం

**బాధితులకు ఫోన్లు అందజేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

కొత్తగూడెం క్రైం, మార్చి 30 : వినియోగదారుడు పోగొట్టుకున్న ఫోన్లను 'సీఈఐఆర్' ద్వారా రికవరీ చేయడం సులభతరమని జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. ఈ పద్ధతి ద్వారా రికవరీ చేసిన పలు ఫోన్లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన చేతుల మీదుగా శనివారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ టెలికాం సంస్థ సహకారంతో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) ద్వారా వినియోగారులు పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేయడం సులభంగా మారిందన్నారు. ఈ క్రమంలోనే జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వచ్చిన 1,674 ఫిర్యాదులను స్వీకరించి, తద్వారా జరిపిన విచారణలో 964 ఫోన్లను తిరిగి రికవరీ చేయడం జరిగిందన్నారు. రికవరీ చేసిన వాటిలో ఇప్పటి వరకు 483 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు వివరించారు. మొబైల్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్‌లో పొందుపరిచిన వివరాలను ఖచ్చితంగా వ్యక్తపరచాలని తెలిపారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి తిరిగి వారి మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి, వాటి లోకేషన్ల ఆధారంగా గుర్తించి రికవరీ చేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా తమ మొబైల్ ఫోన్ దొంగతనానికి గురైనా, వివిధ కారణాల ద్వారా పోగొట్టుకున్నా వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తిరిగి పొందవచ్చని సూచించారు. జిల్లాలోని కొత్తగూడెం త్రీ టౌన్, మణుగూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికంగా ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మడిపెల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవులకు నామా ఈస్టర్ శుభాకాంక్షలు

ఖమ్మం, మార్చి 30 : క్రైస్తవ సోదరులకు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మానవాళికి పాప విముక్తిని కల్పిస్తూ యేసుక్రీస్తు చేసిన త్యాగం మరువలేనిదన్నారు. ప్రేమ, శాంతి, అహింస మార్గంలో మానవాళి నడుచుకోవాలని యేసుక్రీస్తు చేసిన బోధనలను ప్రతిఒక్కరూ అనుసరించాలన్నారు.

## పోలీస్ అధికారుల సమావేశం

ఖమ్మం, మార్చి 30 : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల బందోబస్తు, శాంతిభద్రతలపై సెంట్రల్ ఫోర్స్ ఉన్నతాధికారులతో సమావేశమై చర్చించినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయానికి చేరుకున్న సీఐఎస్ఎఫ్ సౌత్‌జోన్ -11 డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ యం.నందన్‌కి పోలీస్ కమిషనర్ పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానం పలికారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలు, అనుసరించాల్సిన వ్యూహంపై ప్రత్యేకంగా చర్చించారు. సమావేశంలో అసిస్టెంట్ కమాండెంట్ మనోజ్‌కుమార్ మౌర్య, డిప్యూటీ కమాండెంట్ మాల్కిత్ సింగ్ పాల్గొన్నారు.

## నేడు ఇంటిపన్ను చెల్లింపునకు అవకాశం

**నగర కమిషనర్ ఆదర్శ్ సురభి**

ఖమ్మం, మార్చి 30 : ఇంటిపన్ను వడ్డీపై రాయితీకి నేటితో గడువు ముగియనుందని, ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా ఇంటిపన్ను కట్టనివారు నేడు ఆదివారం కూడా ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నగరవ్యాప్తంగా ఏర్పాటుచేసిన కౌంటర్లలో బిల్ కలెక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌంటర్ కూడా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

## కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలి

సత్తుపల్లి, మార్చి 30: సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న తమకు 5 నెలల నుంచి వేతనాలు అందడం లేదని, వెంటనే వేతనాలు ఇప్పించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు శనివారం ఎమ్మెల్యే మట్టా రాగమయికు వినతి పత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు అమర్లపుడి శరత్ మాట్లాడుతూ 5 నెలలుగా వేతనాలు రాకపోయినా పస్తులతో పనిచేస్తూ ప్రజల ఆరోగ్యాలను కార్మికులు కాపాడుతున్నారన్నారు. అనేక సార్లు ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. తకార్యక్రమంలో కార్మికులు రమేష్, కుమారి, వెంకటరమణ, ప్రశాంత్, జయమ్మ పాల్గొన్నారు.

## క్రైస్తవులకు అండగా ఉంటా.. ఎమ్మెల్యే రాగమయి


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, మార్చి 30: క్రైస్తవులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. శనివారం నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్, తెలంగాణ క్రిష్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి పాత సెంటర్ వరకు నిర్వహించి రన్ ఫర్ జీసెస్ ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గుడ్‌ఫ్రైడే అనంతరం రన్‌ఫర్ జీసెస్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అలవాల కరుణాకర్, ఏసుదాసు, సామేలు, వరప్రసాద్, రవికిరణ్, యాకోబు, శ్యాంసన్, నిర్మలాదేవి, ఏసుపాదం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జర్మిబాబు సేవలు చిరస్మరణీయం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, మార్చి 30: పాస్టర్ జర్మిబాబు సేవలు చిరస్మరణీయమని, ఆయన మన మధ్య లేకున్నా ఆయన సేవలు నిరంతరం గుర్తిండిపోతాయని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శనివారం కల్లూరులోని శాంతినగర్‌కు చెందిన ఐబీసీ చర్చి పాస్టర్ గౌడిపేరు జర్మిబాబు ప్రథమ జ్ఞాపకార్థ ఆరాధన కూటమికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జర్మిబాబు సోదరులు, నాయకులు, పాస్టర్లు, సంగస్తులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు సహకరించాలి


మాట్లాడుతున్న వెంగమాంబ

ఖమ్మం, మార్చి 30 : స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు ప్రతిఒక్కరు తమవంతు బాధ్యతను నెరవేర్చాలని ఖమ్మం సర్కిల్ సహాయ కార్మిక అధికారి సీహెచ్ వెంగమాంబ అన్నారు. శనివారం స్థానిక రోటరీక్లబ్‌లో కార్మికశాఖ ఆధ్వర్యంలో టూ వీలర్ మెకానిక్ ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్ సభ్యులకు లోకసభ-2024 ఎన్నికలపై సహాయ కార్మిక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి పీవీకే శాస్త్రి పాల్గొన్నారు

## వండర్‌కిడ్స్‌లో ఫేర్వెల్ వేడుకలు

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 30 : నగరంలోని వండర్‌కిడ్స్ పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులు ఫేర్వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ కొండపల్లి శశిధర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకునేందుకు పటిష్ట ప్రణాళికతో సాగాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి.

**గీతాంజలిలో..**

నగరంలోని గీతాంజలి పాఠశాల వేడుకల్లో కరస్పాండెంట్ టీవీ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు టెన్త్ అనంతరం ఇంటర్మీడియట్ చదువుపై దృష్టి సారించాలన్నారు. అరుణ్, పద్మ పాల్గొన్నారు.

## మధు సేవలు అభినందనీయం

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 30 : రోటరీనగర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మోత్కురు మధు సేవలు అభినందనీయమని జేడీ సర్వీసెస్ పీ మదన్‌మోహన్ అన్నారు. పదవీ విరమణ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వైవీ, కట్టా శేఖర్‌రావు, సతీశ్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★Experienced Supervisors Needed.
1 year of Waterproofing Experience Required. Contact: Jaya Bharathi Constructions at 8790508663.
NT-10287-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616